క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

భానుపురి : సూర్యాపేట రూరల్ మండలం పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో గల న్యూ లైఫ్ మినిస్ట్రీ చర్చిలో నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లూరు దానియేలు అధ్యక్షతన శుక్రవారం ఎన్నుకున్నారు. నూతన గౌరవ అధ్యక్షులుగా పూజర్ల యేసు రత్నం, మోజస్, గౌరవ సలహాదారులుగా పలస సంజీవ, ఇన్నారెడ్డి, అధ్యక్షుడిగా గుగులోతు సోలోమన్ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పల్లేటి రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా మాలి జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కర్నాటి ప్రభుదాసు, సహాయ కార్యదర్శిగా మిద్దె హెబ్రోన్ రాజు, కోశాధికారిగా తడకమల్ల ప్రవీణ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కేశవరపు కిరణ్ కుమార్, గుగ్గిళ్ల చారిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ మామిడి శ్యాంసన్, జిల్లా ఎలక్షన్ చైర్మన్ సాయిని జాకాబు, పట్టణ గౌరవ సలహాదారు మీసాల ప్రభుదాస్, సూర్యాపేట నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ కోక యేసు రత్నం, వైస్ ప్రెసిడెంట్ జలగం పీటర్ బాబు, ప్రధాన కార్యదర్శి సాల్మన్ లింగా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

25న కంటి వైద్యశిబిరం

భానుపురి : హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కంటి ఆస్పత్రి మెడివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ పెన్షనర్స్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దండ శ్యాంసుందర్ రెడ్డి, కార్యదర్శి సుదగాని నాగేశ్వర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించే ఈ ఉచిత కంటి వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహించి.. ఆపరేషన్ అవసరమైన వారిని హైదరాబాద్‌కు ఆస్పత్రి వాహనాల్లో ఉచిత ప్రయాణ సౌకర్యంతో తీసుకెళ్లి ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. క్యాంపునకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డులను వెంట తీసుకొని రావాల్సిందిగా సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఖలీల్ అహ్మద్ సెల్ 9177 999566కు సంప్రదించాలని పేర్కొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

సూర్యాపేట రూరల్ : ఇమాంపేట ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల గడువు తేదీని ఫిబ్రవరి 2వ తేదీ వరకు పొడగించినట్లు ప్రిన్సిపల్ శంకర్ నాయక్ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పనిచేసే వారికి గుర్తింపు



ఎంపీడీఓ ఇందిరను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది

నూతనకల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడే అధికారులకు ప్రజల్లో ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ ఇందిరకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు ఎంపీడీఓ ఇందిరను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, గుగులోతు సజ్జనాయక్, చురుకంటి జానమ్మ, భూరెడ్డి సంజీవరెడ్డి, ఏపీఓ శ్రీరాములు, ఏపీఎం కర్ణాకర్, చూడి లింగారెడ్డి, బొల్లెపల్లి అశోక్, కొచ్చర్ల బాబు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంపీడీఓకు సన్మానం



తిరుమలగిరిలో ఎంపీడీఓ ఉమేష్‌చారిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

తిరుమలగిరి : తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా పని చేసిన ఉమేష్‌చారిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లాజరస్, జెడ్పీటీసీ దూపటి అంజలి, మండల పంచాయతీ అధికారి మారయ్య, పీఆర్ ఏఈ రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు జమ్మిలాల్, రణధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నడిగూడెం : మండలానికి చెందిన 13 మంది లబ్ధిదారులకు కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ హేమమాలిని శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరి : ఖోక్యానాయక్ తండా వద్ద రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తోందని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మండలం ఖోక్యానాయక్ తండా నుంచి గుండ్లబండ్ల తండాకు రూ.2.25 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని తండాలకు రహదారులు నిర్మించే బాధ్యత తనదేనని అన్నారు. తండాలను అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జమ్మిలాల్, దాచేపల్లి వీరశేఖరయ్య, మూల అశోక్ రెడ్డి, సుంకరి జనార్దన్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీ రావాలి..

త్వరలో జరిగే భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ రావాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం ఆయన జలాల్‌పురంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, దాచేపల్లి వెంకన్న, దాచేపల్లి శ్రీను, వీరశేఖరయ్య, కొమ్ము వెంకటమ్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు చెప్పారు. శుక్రవారం అర్వపల్లి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం ఉత్సవ కమిటీకి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేష్ మాజీ జెడ్పీటీసీ కె. అవిలయ్య, ధర్మకర్తలు లక్ష్మాజీ, దిర్శనపు కృష్ణమూర్తి, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధూకర్‌రెడ్డి, బైరబోయిన మహరాజు, అల్వాల వెంకటస్వామి, మేకల రాంబాబు, రాగి అనిల్, బింగి కృష్ణమూర్తి, నల్లగుంట్ల శ్రీనివాస్, కోటి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



అర్వపల్లి ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అమరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి

ఆత్మకూర్(ఎస్) : ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అమరుల స్ఫూర్తితో యువత ఉద్యమించాలని తెలంగాణ రైతుకూలీ పోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బొమ్మకంటి కొమరయ్య అన్నారు. విప్లవోద్యమ సీనియర్ నాయకుడు, అమరుడు ఆరుట్ల శంకర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా రైతు కూలీ పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం రామన్నగూడెంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ పోరాట సమితి నాయకులు పల్స యాదగిరి, బెల్లి నాగరాజు, బత్తుల గురువయ్య, రాచకొండ మల్లయ్య, జుజ్జూరి సత్యం, లచ్చిరెడ్డి, పుల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, సూర్యనారాయణ, లింగారెడ్డి, రామచంద్రు, బి.వెంకన్న, ఆరుట్ల శంకర్ రెడ్డి, జీవిత, సహచరి, ఉపేంద్ర, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



రామన్నగూడెంలో శంకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

నూతనకల్ : దాతల సహాయ, సహకారాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు ఇరుగు కిరణ్ కోరారు. శుక్రవారం నూతనకల్ మండల పరిధిలోని మిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు చల్లా తేజ సహకారంతో స్టడీ మెటీరియల్, ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యాభివృద్ధి కోసం దాతలు వివిధ రూపాల్లో అందించే సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, అనంతుల మధు, కాస శంకర్, బంటు క్రాంతి, మెంచు నగేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

రెగ్యులర్ జడ్జిని నియమించాలి



మాట్లాడుతున్న అన్నెపర్తి జ్ఞానసుందర్

తుంగతుర్తి : తుంగతుర్తిలోని జూనియర్ సివిల్ కోర్టుకు రెగ్యులర్ జడ్జిని నియమించాలని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోర్టు ఏర్పడిన 2010 సంవత్సరం నుంచి నేటి వరకు ఏ జడ్జి కూడా ఆరు నెలలకు మించి పనిచేయలేదని అన్నారు. కోర్టుకు రెగ్యులర్ జడ్జి లేకపోవడంతో కేవలం శుక్రవారం మాత్రమే కోర్టు నడుస్తోందని తెలిపారు. దీంతో కక్షిదారులు, ప్రజలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అంతేకాకుండా కేసులన్నీ పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. తుంగతుర్తిలో కోర్టు భవన నిర్మాణం కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి రెండేళ్ల గడుస్తున్నా నేటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. కోర్టులో రెగ్యులర్ జడ్జిని, ఏజీపీ అసిస్టెంట్‌ను, స్టెనోపోస్టును నియమించి, కోర్టు భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ సీఎం కార్యాలయంలో, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, పోర్ట్‌పోలియో జడ్జికి, రిజిస్ట్రార్ జనరల్‌కు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు న్యాయవాదులు ప్రతాప్, పూల్‌సింగ్ తదితరులు ఉన్నారు.

అగ్నివీర్‌కు వ్యతిరేకంగా 'మిస్డ్ కాల్' ఉద్యమం



పేరబోయినగూడెంలో అగ్నివీర్‌కు వ్యతిరేకంగా మిస్డ్ కాల్స్ ఇస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

నాగారం : సైనిక నియామకాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకాన్ని దేశ యువత వ్యతిరేకించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని ఈటూరు, పేరబోయినగూడెం, వర్ధమానుకోట తదితర గ్రామాల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు మిస్డ్ కాల్ ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అగ్నివీర్ పేరుతో ఎంతో మంది యువకుల జీవితాలు నాశనం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల యూత్ కాంగ్రెస్ నాయకులు వంగూరి నరేష్, పేరబోయిన నాగరాజు, వేణు, మౌలాన, మోష, మధు, కడారి మధు, బెల్లి శేఖర్, బుడిగే ప్రశాంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. అధ్యయనోత్సవాలను నిర్వహించిన అధ్యాపకులకు నూతన వస్త్రాలు బహూకరించి సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ఈఓ వై. శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పి.శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, స్థానాచార్యులు, జీయర్ వెంకటనర్సింహాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

టేకు ఊయల బహూకరణ

శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి అర్వపల్లికి చెందిన మోత్కూరి పరిపూర్ణాచారి–సోమలక్ష్మి దంపతులు రూ.20 వేల విలువ చేసే టేకు ఊయలను బహూకరించారు. శుక్రవారం ఊయలను దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొప్రపిడత అవిలయ్య, ధర్మకర్త జేరుపోతుల సోమయ్య, బైరబోయిన మహరాజు, అర్చకులు రాంబాబు అయ్యంగార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



స్వామి అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌ఐ ఏడుకొండలు

తుంగతుర్తి : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ ఏడుకొండలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు షీటీమ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ఆన్‌లైన్ లాటరీలు, బహుమతులు గెలిచారని వచ్చే ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. సైబర్ నేరాల వల్ల అనేక మంది మోసపోయి డబ్బులు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఏటీఎం నంబర్లు, ఓటీపీ తదితర వాటిని బహిర్గతం చేయవద్దని అన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే 100కు డైల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం పోలీస్ కళాబృందంతో షీటీమ్స్, మహిళల భద్రత, రక్షణ, 100 డయల్, సోషల్ మీడియా, ఓటీపీ ఫ్రాడ్స్, సైబర్ నేరాలు, టోల్ ఫ్రీ నంబర్ 1930, సెల్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాలు తదితర అంశాలపై ఆట, పాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శోభారాణి, పోలీస్ సిబ్బంది విజయ్, యల్లయ్య, గోపయ్య, చారి, నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫణిగిరి యూత్ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

నాగారం : యూత్ కాంగ్రెస్ ఫణిగిరి నూతన కమిటీని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్మకంటి సోమన్న ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నెబోయిన మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా దారం అనిల్, ఉపాధ్యక్షులుగా చుక్క మల్లేష్, రెడ్డిమల్ల మహేష్, కార్యదర్శిగా కల్లెట్లపల్లి అనిల్, సహాయ కార్యదర్శిగా మట్టపల్లి లింగస్వామి, కోశాధికారిగా బత్తుల మహేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా బత్తుల రాకేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ నాయకులు నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ సభ్యులకు నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ వల్లాల భానుప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు నాతి వీరమల్లుగౌడ్, కసిరెడ్డి రాంరెడ్డి, గట్టు లక్ష్మీకాంత్, ఎర్ర సత్తయ్య, అవిలయ్య, జాన్‌వెస్లీ, నాగరాజు, కృష్ణమూర్తి, మనీ, సురేష్, భాస్కర్ పాల్గొన్నారు.



మల్లేష్‌కు నియామకపత్రాన్ని ఇస్తున్న నాయకులు

చెరువులు నింపాలని వినతి

మునగాల : యాసంగి సీజన్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా సాగర్ నీటితో ఆయకట్టు పరిధిలోని చెరువులు, కుంటలను నింపాలని మండలానికి చెందిన సామాజిక కార్యకర్త గంధం సైదులు కోరారు. శుక్రవారం తహసీల్దార్ వి.ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు కూడా రాకపోవడంతో నీటి సమస్య ఏర్పడిందన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ 'బ్లాక్ డే'

దురాజ్‌పల్లి : రైతులపై దాడులకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో బ్లాక్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాల్పుల్లో మరణించిన రైతు కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, రైతులపై చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకుడు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, పార్టీ జిల్లా నాయకుడు పేర్ల నాగయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబోయిన రమేష్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు చంద్రకళ, ఉపాధ్యక్షుడు రేణుక, కోశాధికారి జయమ్మ, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వీరబాబు, జిల్లా కమిటీ సభ్యులు చిత్తలూరి లింగయ్య, శ్రీకాంత్, వినయ్, పద్మ, సునీల్ పాల్గొన్నారు.



దురాజ్‌పల్లి : సూర్యాపేటలో నల్ల జెండాతో నిరసన తెలుపుతున్న నాయకులు

ఆత్మకూర్(ఎస్) : కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన 'బ్లాక్ డే' పిలుపులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు– కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్ మాట్లాడారు. రైతులపై కాల్పులకు ఆదేశాలిచ్చిన హర్యానా ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేసి, సీఎం, హోం మినిస్టర్‌లపై హత్యానేరం కేసు నమోదు చేయాలని, విధుల్లో పాల్గొన్న పోలీసు అధికారులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ముక్కుడు దేవులపల్లిలో మృతిచెందిన న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు దాసరి వీరయ్య భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, దేసోజు మధు, పోరడ్ల దశరథ, బండి రవి, దేగల వెంకటకృష్ణయ్య, గుణగంటి శ్రీను, గడ్డం ఎల్లయ్య, ఎస్కే రహీం, గఫార్, వెంకన్న, దాసరి శ్రీను, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

నేటి నుంచి శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య జాతర

● చీదెళ్లలో ముస్తాబైన ఆలయం
● 29వరకు జరగనున్న వేడుకలు

పెన్‌పహాడ్ : మండలంలోని చీదెళ్ల గ్రామంలో శనివారం నుంచి 29వ తేదీ వరకు శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వాముల జాతరను నిర్వహించనున్నారు. జాతర సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని రంగులతో అందంగా తీర్చిదిద్దారు. కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలు జాతరను తలపించే విధంగా జరిగే ఈ జాతరకు జిల్లా నుంచే గాక కృష్ణా, వరంగల్, ఖమ్మం, గుంటూరు, హైదరాబాద్ జిల్లాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఇక్కడికి వచ్చిన భక్తులకు సంతానం లేని వారికి సంతానం కలుగుతుందనే నమ్మకం ఉంది. శనివారం చీదెళ్లలో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఆదివారం కోలాటాలతో ప్రభబండ్ల ఊరేగింపు, తంగెళ్లగూడెంలో అమ్మవార్ల ఊరేగింపు, 26న తెలుగు రాష్ట్రాల స్థాయి ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు, ఈవెంట్స్, నెల్లూరు వారిచే డ్యాన్స్ కార్యక్రమం, 27న చెట్లముకుందాపురంలో అమ్మవారి ఊరేగింపు, నలబోలు వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, విజయవాడకు చెందిన నటరాజ నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో సాంస్కృతి కార్యక్రమాలు, 28న రామన్నగూడెంలో అమ్మవారి ఊరేగింపు, ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు ఫైనల్స్, ఈవెంట్స్, మిడిశనమెట్ల శివ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. 29న శ్రీలక్ష్మీతిరుపతమ్మ–గోపయ్య స్వాముల కల్యాణ మహోత్సవం (చంద్రపట్నం) నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డిలు తెలిపారు. అదే విధంగా జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మంచినీటి సౌకర్యం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్యస్వాముల ఆలయం

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



"శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్య స్వాముల జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నాం. ఈవెంట్స్, డ్యాన్స్ ప్రోగ్రాంలు ఉంటాయి.

– మోదుగు నర్సిరెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



తిరుమలగిరి : గుండెపురిలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

తిరుమలగిరి : గుండెపురి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.రామారావు, సోమయ్య, లక్ష్మణ్, రవి, స్వరూపారాణి, ఆనంద్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



మద్దిరాల : రెడ్డిగూడెం ప్రభుత్వ పాఠశాలలో..

మద్దిరాల : మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలో చూపరులను ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అబ్బయ్య, ఉపాధ్యాయులు ప్రభాకర్, లక్ష్మీనారాయణ, రవీందర్, సైదమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



జాజిరెడ్డిగూడెంలో మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన బాల్నె పరమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో శుక్రవారం జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధూకర్‌రెడ్డి రూ. 5వేలు, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్ రూ. 5వేలు, బింగి కృష్ణమూర్తి రూ. 1000, ఆకారపు శ్రీను, మేకల సత్యనారాయణ రూ. 1000 ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు నర్సింగ కృష్ణమూర్తి, మామిడి సత్యనారాయణ, తాటిపాముల జలేందర్, కుంభం సత్తయ్య, మామిడి నాగరాజు, రింగు నరహరి, నోముల నరేష్, కోటమర్తి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

అర్వపల్లి : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో శుక్రవారం పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్ మాట్లాడారు. కృత్రిమ గర్భధారణ వల్ల కలిగే లాభాలు, వ్యాధులు – వాటి నివారణ చర్యలపై రైతులకు వివరించారు. సుమారు 100 పశువులకు చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఎల్. శ్రీనివాస్, గోపాలమిత్రలు సురేందర్, అర్జున్, రైతులు పాల్గొన్నారు.

వన నర్సరీ పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సునీత

నూతనకల్ : మొక్కల సంరక్షణకు వన నర్సరీ నిర్వాహకులు కృషి చేయాలని ఎంపీడీఓ సునీత కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని వన నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకానికి చెందిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాలను నిర్దేశించే విధంగా మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శర్మ, ఫీల్డ్ అసిస్టెంట్ గుండాల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో వ్యక్తికి గాయాలు

మద్దిరాల : పాత గొడవలను దృష్టిలో పెట్టుకొని వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన సంఘటన మద్దిరాల మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధునాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రామచంద్రు అనే వ్యక్తి పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని వల్లపు పరమేష్ అనే వ్యక్తిని దూషించాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ నెలకొంది. ఈ క్రమంలో రామచంద్రు, అతడి కుమారుడు వినోద్.. పరమేష్‌పై కర్రతో దాడి చేశారు. బాధితుడి సోదరుడు వల్లపు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫేర్‌వెల్ డే వేడుకలు

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు గురుచరణ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు